క్లుప్తంగా

ఆలయాల అభివృద్ధికి కృషి



సిద్దిపేటరూరల్: మంత్రి హరీశ్‌రావును సన్మానిస్తున్న నిర్వాహకులు

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట మండల పరిధిలోని మాటిండ్ల గ్రామంలో జరుగుతున్న బీరప్ప కామరతి కల్యాణ మహోత్సవాల్లో సోమవారం ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మంత్రి హరీశ్‌రావును శాలువాతో సన్మానించారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని రాజేంద్రనగర్ కాలనీలో మహా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠలో మంత్రి హరీశ్‌రావు సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, నిర్వాహకులు మంత్రి హరీశ్‌రావుకు ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించారు.

నంగునూరు(సిద్దిపేట): మండలంలోని పాలమాకుల ఎల్లమ్మ ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో సోమవారం మంత్రి హరీశ్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘం తరఫున మంత్రికి శాలువాతో సత్కరించారు.

సిద్దిపేటఅర్బన్: మండంలోని తడ్కపల్లిలో జరుగుతున్న ఎల్లమ్మ సిద్దోగంలో మంత్రి హరీశ్‌రావు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని పెద్దమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

వార్డుల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో సీసీరోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.22.87కోట్లతో సీసీరోడ్ల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయన్నారు. మిగితా కాలనీల్లోనూ దశల వారీగా పనులు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ చందు, ఏఈ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

సిద్దిపేటకమాన్: సిద్దిపేట జిల్లా వైద్యారోగ్యశాఖ పాత కార్యాలయం వద్ద రాష్ట్ర మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖకు చెందిన 33 మంది కాంట్రాక్టు ఉద్యోగులు రఘోత్తంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, శ్యామ్‌సుందర్, శ్రీధర్, కొండయ్య, అనురాధ, కొమురయ్య, శ్రావణ్, సురేశ్, నాగరాజు, దేవదాసు, ఆరోగ్య కార్యకర్తలు, ల్యాబ్ టెక్నీషియన్‌లు, ఫార్మాసిస్టులు పాల్గొన్నారు.

ఘనంగా కాశీవిశ్వనాథుడి కల్యాణం



స్వామివారి కల్యాణంలో చైర్‌పర్సన్ వనిత భూంరెడ్డి దంపతులు

దుబ్బాక: దుబ్బాక కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, విఘ్నేశ్వర పూజ, నవగ్రహ ఆరాధన, రుద్రాభిషేకం, రుద్రయాగం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం వేళలో బండ్ల బోనాల ఊరేగింపు కనుల పండువగా సాగింది.

ఆనంద నిలయంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

కొండపాక(గజ్వేల్): మండల కేంద్రమైన కొండపాకలోని ఆనంద నిలయం (వృద్ధాశ్రమం)లో వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపులో ప్రభుత్వ సలహాదారు కే.వీ. రమణాచారి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఏప్రిల్ 27న ప్రారంభమైన వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం పుష్పయాగ మహోత్సవంతో ముగిశాయి. సాయంత్రం 1008 సువర్ణ పుష్పములతో యాగ మహోత్సవాన్ని బ్రాహ్మణులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆనంద నిలయం ట్రస్టు చైర్మన్‌గా ప్రభుత్వ సలహాదారు రమణాచారి భార్య లత వ్యవహరిస్తున్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



కొమురవెల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గౌరాయపల్లి, కొమురవెల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆలయ చైర్మన్ గీస భిక్షపతితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలను చూసి రైతులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. వడగళ్ల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పంట నష్టపోయిన రైతుల వివరాలను అధికారులు నమోదు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పని చేస్తుందన్నారు. అంతకుముందు కొమురవెల్లిలోని హమాలీ సంఘం నూతన భవనాన్ని ప్రారంభించి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తలారి కీర్తన, జెడ్పీటీసీ సిద్దప్ప సర్పంచ్‌లు సార్ల లత, కృష్ణారెడ్డి, స్వామి, ఎంపీవో మంజుల, ఆలయ ధర్మకర్తలు రఘువీరారెడ్డి, సౌజన్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు సంపూర్ణ, ఐకేపీ ఏపీఎం ప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



దుబ్బాక: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ లక్ష్మి తదితరులు

దుబ్బాక: రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని దౌల్తాబాద్, రాయపోల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఇప్ప లక్ష్మి అన్నారు. సోమవారం దౌల్తాబాద్ మండల పరిధిలోని ముబారస్ పూర్, ముత్యంపేట, సూరంపల్లి, మల్లేశంపల్లి, అహ్మద్‌నగర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో నర్సింలు, యాదగిరి, రాజు, పాషా షేక్ హిమాంబి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వెంకన్న, లక్ష్మణ్, నాయకులు తదితరులున్నారు.

పరిహారం అందేలా చూస్తాం

ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



పందిల్లలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి



లకుడారంలో దెబ్బతిన్న వరిపైరును చూపుతున్న రైతు

కొండపాక(గజ్వేల్): వడగండ్ల వర్షాలతో నష్టపోయిన పంటలకు పరిహారం అందేలా చూస్తామని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవి రవీందర్ భరోసానిచ్చారు. కుకునూరుపల్లి మండలంలోని మేదినీపూర్, లకుడారం గ్రామాల్లో వడగళ్లతో దెబ్బతిన్న పంటలను సోమవారం గజ్వేల్ డివిజన్ వ్యవసాయాధికారి బాబూనాయక్‌తో కలిసి పరిశీలించారు. మంగోల్, బొబ్బాయిపల్లి, మాత్‌పల్లి, కుకునూరుపల్లి గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు అధైర్యపడొద్దని కోరారు. వ్యవసాయ విస్తరణాధికారులు క్షేత్రస్థాయిలో తిరుగుతూ పంట నష్టం వివరాలను రికార్డు చేసుకునేలా చూసుకోవాలని ఏడీఏ బాబూనాయక్‌కు సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ పిస్క అమరేందర్, సర్పంచ్‌లు కోల శ్రీనివాస్, పుల్లోజు కిరణ్‌కుమార్‌చారి, బచ్చలి మహిపాల్, కందూరి కనుకవ్వ, ఆత్మ కమిటీ డైరెక్టర్లు కనకయ్య, శంకర్, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ మండల వ్యవసాయాధికారి నాగరాజుతో కలిసి ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు అరిగె అశోక్‌లు వర్షాలతో దెబ్బతిన్న వరిపైరును పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి నాగరాజు మాట్లాడుతూ.. కొడకండ్ల, రిమ్మనగూడ, అక్కారం గ్రామాల్లో వర్షాల కారణంగా 245 ఎకరాల్లో వరి, 198 ఎకరాల్లో మొక్కజొన్నకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేశామన్నారు. పూర్తి స్థాయిలో వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదికను అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం మండల వ్యవసాయ అధికారి వసంతరావు పర్యటిస్తూ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వడగండ్ల వర్షానికి పంట నష్టంపై అంచనా వేస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 17 వందల ఎకరాల్లో పంటనష్టం జరిగిందని చెప్పారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

హుస్నాబాద్‌రూరల్: అకాల వర్షంతో తడిసి ముద్దయిన ప్రతీ గింజను కొనుగోలు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం హుస్నాబాద్ మండలంలోని పందిల్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, తడిసి మొలకెత్తిన రైతు ధాన్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపే మల్లేశం, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల పట్టణాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని 5వ వార్డులో కొనసాగుతున్న ఆస్పత్రి నిర్మాణ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణితో కలిసి పరిశీలించారు. అనంతరం స్థానికంగా నిర్మిస్తున్న దుర్గామాత ఆలయం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తిరెడ్డి మాట్లాడుతూ.. పట్టణ కేంద్రంలో కోర్టు ఏర్పాటు ప్రక్రియ చివరి దశలో ఉందని త్వరలోనే కోర్టు ప్రారంభం అవుతుందన్నారు. అదేవిధంగా పట్టణ ప్రజల కోరిక మేరకు పన్ను తగ్గింపు కూడా జరిగిందని, త్వరలోనే అధికారికంగా జీఓ విడుదల అవుతుందన్నారు. ఆయన వెంట ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, మంగోలు చంటి, పచ్చిమడ్ల సతీశ్, మార్కెట్ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

వర్షాలతో రైతులు ఉక్కిరిబిక్కిరి



కూటిగల్ కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

మద్దూరు(హుస్నాబాద్): వర్షాలతో రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కొద్ది రోజులుగా ఉమ్మడి మద్దూరు మండలంలో ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతలు దిగాలు చెందుతున్నారు. దీనికి తోడు అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. ప్రారంభించినా కొనుగోలు చేయడం లేదు. దీంతో కష్టపడి కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన ధాన్యం వర్షానికి తడిసి ముద్దవుతుంది. ధాన్యం మొలకెత్తడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లు లేవని, తాగునీరు లాంటి కనీస మౌలిక సౌకర్యాలు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కల్పించడంలో విఫలమయ్యారని రైతులు విమర్శిస్తున్నారు. త్వరగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, ప్రారంభించిన కొనుగోలు కేంద్రాల ధాన్యం కాంటా పెట్టాలని రైతులు కోరతున్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): అకాల వర్షాలతో మండలంలో రైతులు బేజారవుతున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం తడిసి రైతులు నష్టపోతున్నారు. పలు కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబోసిన ధాన్యం వర్షానికి తడిసింది. వెంటనే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

హనుమాన్ స్వాములకు పండ్లు పంపిణీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని మార్కండేయ ఆలయంలో హనుమాన్ మాలధారణ స్వాములకు కేఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి రోజు ఉచితంగా నిర్వహిస్తున్న పాలు, పండ్లు, అల్పాహార పంపిణీ కార్యక్రమానికి సోమవారం ఫౌండేషన్ చైర్మన్ కల్వకుంట్ల వంశీధర్‌రావు హాజరై పలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హనుమాన్ మాలధారణ స్వాములు పెద్ది అశోక్, జవన రమేశ్, బీఆర్ఎస్ నాయకులు కొండ రాజ్‌కుమార్, సురేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, అశోక్, చిన్న, వెంకట్, గిరి, కిరణ్, వెంకట్ పాల్గొన్నారు.

రెగ్యులర్ చేసేంత వరకు పోరాడుతాం

జేపీఎస్‌ల సమ్మెకు దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు సంఘీభావం

సిద్దిపేటరూరల్: 4 ఏళ్ల ప్రొబేషన్ కాలాన్ని పూర్తి చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల న్యాయమైన డిమాండ్లను నెరవేరుస్తూ వెంటనే రెగ్యులరైజేషన్ చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. సోమవారం తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మెకు దుబ్బాక ఎమ్మెల్యే సంఘీభావం తెలిపారు. ఈ దీక్షకు జిల్లా వ్యాప్తంగా 350 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు మాట్లాడుతూ.. నాలుగు రోజులుగా శాంతియుతంగా జేపీఎస్, ఓపీఎస్‌లు దీక్ష చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం గోరమన్నారు. ప్రభుత్వం నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా సర్వీస్ కౌంట్ చేస్తూ జేపీఎస్, ఓపీఎస్‌లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శుల డిమాండ్లు నెరవేరేంతవరకు పోరాటం కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఆయా మండలాల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ తాతా మా అమ్మను రెగ్యులర్ చేయండి

తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ జేపీఎస్‌లు చేస్తున్న సమ్మెలో సోమవారం ఓ పంచాయతి కార్యదర్శి తన కూతురితో సీఎం కేసీఆర్‌ను 'కేసీఆర్ తాత మా అమ్మను రెగ్యులరైజ్ చేయండి' అంటూ ప్లకార్డును పట్టించి వినూత్నంగా నిరసనను వ్యక్తం చేసింది. ఈ సమ్మెలో గర్భిణులు సైతం పాల్గొంటూ తమను ప్రభుత్వం రెగ్యులర్ చేసేంతవరకు శాంతియుతంగా ప్రభుత్వంపై పోరాడుతమన్నారు.



చిన్నారితో ప్లకార్డు పట్టించి నిరసన వ్యక్తం చేస్తున్న కార్యదర్శి



సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం

గజ్వేల్‌రూరల్: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మెడికల్ డయోగ్నస్టిక్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని సీఎం మినీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నిమ్మ రమేశ్, గౌరవాధ్యక్షుడు దేవులపల్లి రాజారాంలు మాట్లాడుతూ.. ల్యాబ్ టెక్నీషియన్ల సంక్షేమానికి ప్రభుత్వం చొరవ చూపడం అభినందనీయమని, మెడికల్ డయోగ్నోస్టిక్స్ అసోసియేషన్‌కు స్థలాన్ని కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ సలహాదారు నవాజ్‌మీరా, సభ్యులు కటుకం శ్రీనివాస్, ముజాహిద్, ఆనంద్, కర్ణాకర్, ఆంజనేయులు, సురేశ్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెడికల్ డయోగ్నోస్టిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు

పనుల్లో నాణ్యత పాటించాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చంద్లాపూర్‌లో 'మన ఊరు–మన బడి' పనులను సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. త్వరలోనే పనులు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లంలో బోధన జరుగుతుందన్నారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఆయన వెంట సర్పంచ్ చంద్రకళ, ఎంపీటీసీ దుర్గారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న నాయకులు

ఘనంగా మేడే వేడుకలు

ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కార్మిక సంఘాల నాయకులు ఎర్ర జెండాను ఎగురవేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పలు గ్రామాల్లో నాయకులు ర్యాలీ నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని పలువురు ఆరోపించారు. కార్మికులు ఐక్యంగా తమ హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు.



హుస్నాబాద్‌లో జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



మిరుదొడ్డి(దుబ్బాక): జెండా ఎగురవేస్తున్న హెచ్‌ఎంఎస్ జాతీయ కార్యదర్శి సుదర్శన్‌రావు



మద్దూరు మండల కేంద్రంలో..



చిన్నకోడూరు(సిద్దిపేట): జెండా ఎగురవేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ



గజ్వేల్‌రూరల్: గజ్వేల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు



చేర్యాలలో..



దుబ్బాకలో జెండాను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బదిలీ

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కమ్ ఫస్ట్ క్లాస్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ సల్మా ఫాతిమాను రంగారెడ్డి జిల్లా జూనియర్ సివిల్ జడ్జి కమ్ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్‌గా బదిలీ చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

◆ బండి సంజయ్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ రాష్ట్ర సచివాలయానికి డాక్టర్ అంబేడ్కర్ పేరు పెట్టడాన్ని జీర్ణించుకోలేని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సచివాలయాన్ని కూల్చివేస్తాం అనడం సరికాదని, వెంటనే బండి సంజయ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసును నమోదు చేయాలని సిద్దిపేట 37వ వార్డు కౌన్సిలర్ సాకి ఆనంద్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆ ఆనంద్ మాట్లాడుతూ.. బండి సంజయ్ తెలంగాణ సచివాలయంపై మొదటి నుంచి వ్యతిరేకత చూపిస్తున్నాడని, అంబేడ్కర్ పేరు పెట్టగానే మరింతగా వ్యతిరేకత చూపిస్తున్నాడన్నారు. కార్యక్రమంలో మాల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామస్వామి, కుల సంఘం నేతలు కనకమల్లయ్య, మల్లేశం, బాలయ్య, శివరాజం, రాజు పాల్గొన్నారు.

◆ ములుగు మండల యాదవ సంఘ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

ములుగు(గజ్వేల్): ములుగు మండల యాదవ సంఘం నూతన అధ్యక్షుడిగా నూనె వెంకటేశ్ యాదవ్, కార్యదర్శిగా సింగం రాజుయాదవ్, ఉపాధ్యక్షుడిగా మారమైన బాబుయాదవ్ నియమితులయ్యారు. సోమవారం ఈ ఎన్నిక జరిగింది. అదేవిధంగా యువజన విభాగం అధ్యక్షుడిగా మల్లంపల్లి చంద్రం, కార్యదర్శిగా పెరుగు కుమార్‌యాదవ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బూరం గణేశ్‌యాదవ్, నర్సాపూర్ సర్పంచ్ మల్లేశ్‌యాదవ్, చిన్న తిమ్మాపూర్ సర్పంచ్ కన్నెబోయిన మహేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

◆ నియామకం

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి మండల అంబేడ్కర్ యువజన సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బొనగిరి శ్రీనివాస్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు దీటి బాలనర్సు తెలిపారు. ఉపాధ్యక్షులుగా కల్లూరి రవి, మాంకాలి స్వామి, సెక్రటరీ జనరల్‌గా రాగుల రాజు, ప్రచార కార్యదర్శిగా వెన్న అశోక్, కోశాధికారిగా పట్నం రమేశ్, కార్యదర్శులుగా బొనగం రమేశ్, మాంకాలి రాజు, బెజ్జంకి పోచయ్యలతో పాటు కార్యవర్గ సభ్యులుగా మాతంగి చంద్రశేఖర్, బొనగిరి ఉదయ్‌కిరణ్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్‌బాబు, శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ నాయకుడు పరశురాములు పాల్గొన్నారు.

◆ బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే

దుబ్బాకరూరల్: మండలంలోని చీకోడ్ గ్రామంలో నిర్వహిస్తున్న పోలెరమ్మ, వీరబ్రహ్మేంద్రస్వామి బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే రఘునందన్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి సన్మానించారు.

◆ దళితబంధు దళారులపై చర్యలు తీసుకోవాలి

చేర్యాల(సిద్దిపేట): దళిత బంధు దళారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్, దళిత సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేసిన అనంతరం వారు మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సుమారు 100కు పైగా బాధితులు ఉన్నారని, మేజర్ గ్రామ పంచాయతీ అయిన ఆకునూరు పరిధిలో 20 మంది వద్ద, పట్టణ కేంద్రంలో 50 మంది వద్ద డబ్బులు వసూలు చేశారని, వెంటనే వారి డబ్బులు వారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్పీ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జ్ మల్లిగారి యాదగిరి, డివిజన్ ఇన్‌చార్జ్ సనువాల ప్రసాద్, బీఎస్పీ నాయకుడు బుట్టి భిక్షపతి, మాల మహానాడు నాయకుడు రాజు, ఎఐఎస్‌బీ విద్యార్థి సంఘ నాయకుడు పుల్లని వేణు, నాయకులు పాల్గొన్నారు.

◆ సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి

గజ్వేల్‌రూరల్: వాలీబాల్ సమ్మర్ కోచింగ్ క్యాంపును క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్, టెన్నీస్ వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్‌కే హైదర్ పటేల్ పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్ పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్ ఆవరణలో ఈనెల 31వరకు ప్రతిరోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, సెపక్‌తక్రా జిల్లా ప్రధాన కార్యదర్శి, ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు విజయరేఖ, సభ్యులు పాల్గొన్నారు.